క్లుప్తంగా

మహిళా కళాశాలలో వన మహోత్సవం



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు

దాబాగార్డెన్స్: వన మహోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం మొక్కలు నాటారు. కళాశాల ఎన్ఎస్ఎస్, గ్రీన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జె.లావణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఎస్.అనూష, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ లలితా శరణ్య మొక్కలు నాటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ఎకో-వాక్ నిర్వహించారు. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ మంజుల విద్యార్థినులకు వివరించారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన టాలీ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల చేతుల మీదుగా విద్యార్థినులు సర్టిఫికెట్లు అందుకున్నారు. కోర్సులో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను గోల్డ్, సిల్వర్ మెడల్లతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.సురేష్‌కుమార్, సెక్రటరీ వి.సతీష్‌కుమార్, కోశాధికారి సీవీజే గుప్త తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కిరండూల్ మార్గంలో నడిచే రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్- కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. ఈ నెల 6,7వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్- కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

పూరీ రథయాత్ర స్పెషల్ రద్దు

రేక్ అందుబాటులో లేని కారణంగా విశాఖపట్నం-పూరీ-విశాఖపట్నం మధ్య నడిచే స్పెషల్ రైలును రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 6వ తేదీన విశాఖపట్నం-పూరీ(08313) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన పూరీలో బయల్దేరాల్సిన పూరీ-విశాఖపట్నం (08314) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

ఇమ్యునైజేషన్‌తో సీజనల్ వ్యాధులకు చెక్

బీచ్‌రోడ్డు: చిన్నతనంలో మనం అందించే ఇమ్యునైజేషన్ షెడ్యూల్ మన పిల్లల ఆరోగ్యానికి పునాది వేస్తుందని లోటస్ హాస్పిటల్స్ పిడియాట్రీషియన్, లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ కె.వి. రాజా రమేష్ అన్నారు. ఇమ్యునైజేషన్‌తో సీజనల్ వ్యాధులు, చిన్నారులకు వచ్చే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. 4 నుండి 6 సంవత్సరాల వయసు పిల్లలకు ఇమ్యునైజేషన్ బూస్టర్లు మరింత రక్షణ కల్పిస్తాయన్నారు. డీపీటీ, పోలియో వంటి కీలక వ్యాక్సిన్లు సంపూర్ణ ఆరోగ్యం అందిస్తాయన్నారు.

ఆ దారులు.. నరకానికి నకళ్లు



ప్రమాదాలు జరుగుతున్న ఎస్సార్ కంపెనీ మార్గం



స్పీడ్ బ్రేకర్లు లేని కాన్వెంట్ కూడలి

- కాన్వెంట్ కూడలి నుంచి నాల్కోకు వెళ్లే రహదారిలో నిత్యం ప్రమాదాలు
- భారీ వాహనాల అతివేగం.. **స్పీడ్‌బ్రేకర్లు** లేకపోవడం కారణమంటున్న వాహన చోదకులు
- అధికారులు చర్యలు తీసుకో**వాలని** పలువురి వినతి



కాన్వెంట్ కూడలి నుంచి పోర్టు వైపు వెళ్లే మార్గం

కంచరపాలెం: కాన్వెంట్ జంక్షన్ నుంచి నాల్కో ట్యాంక్‌లకు, వైజాగ్ సీపోర్ట్, ఓహెచ్‌సీ, పోర్ట్ ఆర్ అండ్ డి యార్డ్, కేఆర్ అండ్ సన్స్, బొత్రా, డాల్ఫిన్ గొడౌన్లకు వెళ్లే మార్గాలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. హిందూ శ్మశాన వాటికను దాటుకుని ముందుకు వెళ్లే మార్గంలోని ఎస్సార్ కంపెనీ వైపు నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా అతి వేగంగా వచ్చే భారీ వాహనాల రాకపోకల కారణంగా ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. ప్రమాదాల కారణంగా కొందరు గాయాల బారిన పడుతుంటే మరి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకునే దిశగా చర్యలు చేపట్టడం లేదని పాదచారులు, వాహన చోదకులు, ఆయా కంపెనీల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్ కంపెనీ నుంచి కాన్వెంట్ కూడలికి వెళ్లే ఫ్లై ఓవర్ నుంచి కుడివైపుకు వెళ్లే మరో బ్రిడ్జి వైపుగా వెళ్లే పోర్ట్ జీసీబీ ఈస్ట్ యార్డ్, ఆర్‌లెవన్ ప్రాంతాలకు కార్గో సప్లై చేసే భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహన చోదకులు చెబుతున్నారు. వంతెనల కూడళ్లలో నిత్యం రెడ్ సిగ్నల్స్ బ్లింక్ అవుతున్నా భారీ వాహనాలు (కంటైనర్లు) డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నట్లు చెబుతున్నారు. రెడ్ బ్లింకింగ్ లైట్ల వద్ద ఆగి వెళ్లాలన్న నియమాన్ని పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండడం వల్ల ద్విచక్ర వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరో పెద్ద సమస్య స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం అంటున్నారు. అవి లేకపోవడం వల్ల భారీ వాహనాలు అతివేగంగా వెళ్తూ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి వాటిని అరికట్టేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే కొంత మేర ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు కార్మికులు, ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా హార్బర్ పోలీస్ అధికారులు, జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేగానికి కళ్లెం వేయాలి..

వంతెన కూడళ్లు ప్రమాదభరితంగా తయారయ్యాయి. అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయం వేస్తోంది. విధులకు వెళ్లే సమయంలో భయపడుతూనే ప్రయాణం చేస్తున్నాం. సెలవు రోజుల్లో కుటుంబంతో టౌన్‌కు వెళ్లేటప్పుడూ అలాగే ఉంటుంది. భారీ వాహనాల వేగానికి కళ్లెం వేస్తేనే సాఫీగా ప్రయాణాలు సాగుతాయి.

– వి.గోపాలరావు, ద్విచక్ర వాహన చోదకుడు, జ్ఞానాపురం

అధికారులు స్పందించాలి..

ఫ్లైఓవర్ల పరిధిలో జరుగుతున్న ప్రమాదాల్లో పలువురు గాయ పడుతుంటే మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట పడాలంటే అధికార యంత్రాంగం ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– శివనారాయణ, కాన్వెంట్ జంక్షన్

కేజీహెచ్ ఏవోగా సత్యనారాయణ



సత్యనారాయణను అభినందిస్తున్న డాక్టర్ వాణి

మహారాణిపేట: కేజీహెచ్ ఏవోగా జి.సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఏవో మంగరాజు సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం రిమ్స్‌కు వెళ్లారు. ప్రస్తుతం కేజీహెచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణకు తాజాగా పదోన్నతి లభించడంతో కేజీహెచ్‌లోనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, అడ్మినిస్ట్రేటర్ బి.వి రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యనారాయణను డాక్టర్ వాణి, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ బీఎస్ సుమతి, అకౌంటెంట్ శ్రీనివాసాచారి, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పంచామృతాభిషేకం

సీతంపేట: ఆషాఢ మాసం, దశమి స్వాతి నక్షత్రం సందర్భంగా లలితానగర్ శ్రీలలితా పీఠంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామికి శనివారం విశేష పంచామృతాభిషేకం జరిపించారు. పండితుల వేద మంత్రాల మధ్య అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అభిషేకంలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి దర్శనమిచ్చారు. అనంతరం విశేష హారతులిచ్చారు.

అభివృద్ధి సూచికలు అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి



హాజరైన అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు

మహారాణిపేట: పంచాయతీల అభివృద్ధికి పొందుపరిచిన 22 సూచికలు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణ మూర్తి అన్నారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి సూచికపై ఒక రోజు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం తగదన్నారు. పంచాయతీ అభివృద్ధి సూచిక అమలు చేసి జాతీయ అవార్డులు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ (డీపీఆర్‌సీ) ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఉద్యానవన శాఖ అధికారులు ఎం.ఎ. రహీం, బి.శ్యామల, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కీర్తి చక్ర మేజర్ రాంగోపాల్ నాయుడు



మేజర్ రాంగోపాల్ నాయుడిని అభినందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: దేశ సరిహద్దులోని నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదులతో అసమాన రీతిలో పోరాటం చేసి 2024లో కీర్తిచక్రకు ఎంపికైన మేజర్ రాంగోపాల్ నాయుడు శనివారం కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో వివిధ అంశాలపై మాట్లాడుకున్నారు. దేశ రక్షణకు అత్యంత ధైర్య సాహసాలతో సేవలందిస్తున్న మేజర్ రాంగోపాల్ నాయుడిని కలెక్టర్ అభినందించారు.

కళాశాల విద్యార్థికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన అచ్చన్న కుమార్తె వాసుపల్లి వైష్ణవికి కళాశాల ఫీజు కోసం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి హామీలన్నీ అబద్ధాలే అన్నారు. పేదలకు సంక్షేమాన్ని అందించలేని చంద్రబాబు ప్రభుత్వం గద్దె దిగాలన్నారు. ఇక టీడీపీతో జతకట్టిన పవన్‌కల్యాణ్ ఇచ్చిన వాగ్దానాలకి, చేసిన పనులకు ఎక్కడా సంబంధమే లేదని ఎద్దేవా చేశారు. లోకేష్ రాజ్యాంగ విరుద్ధంగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కక్షపూరిత రాజకీయాలకే పరిమితమయ్యారని వాసుపల్లి దుయ్యబట్టారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో 42వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు అబ్బిరెడ్డి ఆదివిష్ణురెడ్డి, వద్దాది దిలీప్, లండా రమణ, గరికిన వెంకటేష్, జీరు సూర్యనారాయణరెడ్డి, సువార్త రాజు, మల్లా బుజ్జి, తాడి రవితేజ, ఆకుల శ్యామ్, కంటుముచ్చు సాగర్, నాని, గంగాధర్, వాసుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు నరమేధంపై 13న మహా సదస్సు



భీమ్ సేన వార్ సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: కారంచేడులో దళితులపై దాడి జరిగి నలభై ఏళ్లు కావస్తున్న సందర్భంగా ఈనెల 13న సదస్సు నిర్వహించాలని భీమ్ సేన వార్ నిర్ణయించింది. శనివారం కంచరపాలెంలోని ఆ సంస్థ కార్యాలయంలో జనరల్ సెక్రటరీ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు విషయాలు చర్చించారు. 1985 జులై 17న ప్రకాశం జిల్లా కారంచేడులో పాలక పెద్దందారీ దురహంకారంతో దళితులపై దాడి జరిగిందన్నారు. ఈనెల 17కు నలభై ఏళ్లు కావస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 13వ తేదీన విశాఖ పౌర గ్రంథాలయంలో కారంచేడు నరమేధానికి నలభై ఏళ్లు అనే అంశంపై భీమ్ సేన వార్ మహా సదస్సు నిర్వహిస్తుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సులో పలు విషయాలు చర్చిస్తామని తెలిపారు. ఆనాటి బాధితుల సంబంధీకులు, ఆ సంఘటనకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమ నాయకులు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు అందరూ హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరుతన్నామన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ సేన వార్ అధ్యక్షులు కె. చిన్నారావు, గుంపుల భూపతిరావు, ఉపాధ్యక్షులు వి.వి.దుర్గారావు, నాయకులు వేమన, తిరుమలరావు, బాలకృష్ణ, రవికుమార్, రేణు కుమార్, జ్యోతి బాలకృష్ణ, చంద్రశేఖర్, రత్న కుమారి, శేఖర్, శంకర్, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ టీఎస్ఆర్ నుంచి కొమ్మాది పంపింగ్ మెయిన్‌లైన్ లీకేజీ కారణంగా, మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలకు ఈనెల 7వ తేదీన తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-2 పరిధి 10వ వార్డు వెటర్నరీ కాలనీ, రాజీవ్‌నగర్, ఇందిరాగాంధీ నగర్, ఆదర్శ్‌నగర్, సుందర్‌నగర్, వివేకానందనగర్, నాగేశ్వరరావుపేట, రామాలయం వీధి, రవీంద్రనగర్, ఎస్‌బిజీ నగర్, బీఎస్ఆర్ నగర్, 11వ వార్డు కైలాసనగర్, డ్రైవర్స్ కాలనీ, శివాలయం వీధి, టీఎస్‌సీ పాయింట్, శ్రీరామ్‌నగర్, గాంధీనగర్, బాలాజీనగర్, ముస్తాఫా కాలనీ, వికలాంగుల కాలనీ, అన్నానగర్, తోటగరువు, సుందరయ్యనగర్, పాత ఆరిలోవ, పార్వతీనగర్, 12వ వార్డు లీలా సుందర్‌నగర్, హిందీ కాలేజీరోడ్డు, నెహ్రూనగర్, గణబాబు నగర్, పెదగదిలి శివాలయం వీధి, పెదగదిలి పోస్టాఫీస్ వీధి, పెదగదిలి రామాలయం వీధి, అంబేద్కర్ కాలనీ, పోలమ్మ టెంపుల్, వినాయకుడి నగర్, సాలిపేట, చిన గదిలి, సంతపాలెం, రామలక్ష్మీపురం, నేతాజీనగర్, న్యూ శాంతినగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఆస్పత్రి సేవలుండాలి



సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ఫీజులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. కమిషనర్ చాంబర్‌లో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ప్రతినిధులతో శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రిని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పరిచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయమై విధి విధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ఆస్పత్రిని నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి సంబంధించిన అంశంపై గతంలో కౌన్సిల్లో చర్చించామని, దానికి అనుగుణంగా ప్రజలకు ఎఫ్ఆర్‌యూ సెంటర్ లీజు అగ్రిమెంట్, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఫీజుల వసూలు, మెరుగైన వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించినట్లు కమిషనర్ తెలిపారు.

శ్రీకృష్ణుడిగా జగన్నాథుడు



బలరామ సుభద్ర శ్రీకృష్ణావతారంలో జగన్నాథస్వామి

దాబాగార్డెన్స్: దశావతారాల్లో భాగంగా జగన్నాథస్వామి శనివారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు టర్నర్ చౌల్ట్రీకి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. రామతీర్థం రామచంద్రస్వామి దేవస్థానం తరపున సహాయ కమిషనర్, ఈవో వై.శ్రీనివాసరావు దంపతులు, సీనియర్ అసిస్టెంట్ డి.రామారావు, స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు, ప్రధానార్చకుడు ఖండవిల్లి కిరణ్‌కుమార్ జగన్నాథస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామికి సామూహిక లలితా సహస్రనామ పారాయణ, సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 1,200 మంది భక్తులకు అన్న సమారాధన జరిగింది. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం జగన్నాథస్వామి శేషపాన్పుపై దర్శనమివ్వనున్నారు. కాగా.. స్వామి వారి తిరుగు రథయాత్ర సోమవారం ఉదయం 9.45 గంటలకు రథంపైకి ఆహ్వానించడంతో ప్రారంభమవుతుంది. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ సత్రం నుంచి మేళతాళాలు, బాణసంచా, మంగళ వాయిద్యాలతో వైభవంగా జరగనుంది.

వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు



తోట పద్మావతి ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు




సమావేశానికి వెళ్తున్న జ్ఞానాపురం నాయకులు, ప్రజలు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం ఉదయం రుషికొండ ఏ1 గ్రాండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో వార్డు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, అనిల్, యాసరపు రాజు తదితరులు ఉన్నారు.

41వ వార్డు నుంచి..

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి జీవీఎంసీ 41వ వార్డు నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి వార్డు నేతలు, ప్రజలు తరలిరావడం అభినందనీయమన్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పాత్రపల్లి సునిల్‌కుమార్, మురళి, దాలిబాని మధు, ఈశ్వరి, దేవి, కిషోర్, వేళాంగిణి, కనకరత్నం, ఎలీషా, పార్సి, మధు, శేఖర్, వేళాంగిణిరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథునికి విశేష పూజలు



విశేష అలంకరణలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి



రథయాత్రలో పాల్గొన్న ఉత్కల్ సేవా సమాజ్ ప్రతినిధులు, భక్తులు

అల్లిపురం: నేరెళ్లకోనేరులోని ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథుని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాలను విశేషంగా అలంకరించి మౌర్య హోటల్ దరి తాత్కాలిక మండపం ఏర్పాటు చేసి నెలకొల్పారు. గత తొమ్మిది రోజులుగా బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్వామి వారికి విశేష పూజలు చేపడుతున్నారు. హరే రామ.. హరే కృష్ణ మూల మంత్రంతో, సంగీత వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ భక్తి శ్రద్ధలతో భజనలు చేపడుతున్నారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలి వస్తున్నారు.

ఘనంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర..

ఉత్కల్ యువ సేవా సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి ఉత్సవాలలో భాగంగా శనివారం తిరుగు రథయాత్ర మౌర్య హోటల్ వద్ద నుంచి వైభవంగా ప్రారంభమైంది. జగన్నాథుడు తన సోదరుడు బలభద్ర, సోదరి సుభద్రలతో కలిసి రథాలతో ప్రయాణించడం, రథ యాత్రలోని అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ రథయాత్ర చలువతోట, సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు మీదుగా తిరిగి నేరెళ్లకోనేరు కాలనీకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రమేష్ పాడి సుదర్శన్, అప్పారావు, బుజ్జి, నాగేంద్ర, మణి, కేదార్నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీకి పార్థివదేహం అప్పగింత



ఏఎంసీ వైద్యులకు మూర్తి పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న బంధువులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన బాలయ్యశాస్త్రి లేఔట్‌కి చెందిన తణుకు వెంకట సత్యనారాయణ మూర్తి (78) మృతదేహాన్ని కుటుంబ సభ్యులు శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆయన అనకాపల్లిలో కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో కమిషనర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సావిత్రి ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరణానంతరం దేహ దానానికి విల్లు రాసిచ్చారు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సత్యనారాయణ మూర్తి అంతిమ కోరిక మేరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో శరీర దాతల సంఘం జిల్లా కార్యదర్శి వై. నూకరాజు సత్యనారాయణమూర్తి పార్థివ దేహాన్ని ఏఎంసీకి అప్పగించారు.

జీవీఎంసీ కమిషనర్ అర్ధరాత్రి తనిఖీలు



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అల్లిపురం: నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన రామా టాకీస్, సౌత్ జైల్ రోడ్డు, సిరిపురం, పాండురంగాపురం, హార్బర్ పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో ఆలసత్వం వహించరాదని అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. పోర్టు రోడ్డు, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో ఏయే ప్రాంతాల్లో ఎంత మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. సౌత్ జైలు రోడ్డు మార్గంలో 15వ ప్యాకేజీ రాత్రి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు లేకుండా పరిశుభ్రపరిచి నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు.